# రాంగ్ నంబర్

షీలా శివరామ్

ఫోన్ గణగణ మోగింది. పాపనాశనం గారు ఫోనెత్తి 'హల్లో' అన్నారు.

'అయ్యా నమస్కారం' అంటూ వినిపించింది.

'నమస్కారం.'

'అయ్యా అమ్మాయికి పెళ్ళి నిశ్చయమయిందట గదా! అభినందనలు స్వీకరించండి స్వామీ. మొత్తానికి 'బిగ్ షాట్'ని పట్టారుటగదండీ బాబూ!'

'హీ హీ థేంక్స్. మీరూ .. '

'అయ్యో. నేనండీ బాబూ. నేను .. ఇంకా గుర్తురాలేదా? భలేవారండీ, ఆరోజు రైల్లో ఫస్టుక్లాసు కంపార్టుమెంట్‌లో '

'........'

'మొత్తానికి బ్రహ్మాండమయిన సంబంధం కొట్టేశారులెండి. పోలీసు కమీషనరు మొన్న క్లబ్బులో కనబడి చెప్పాడు ఇలా అని.'

'ఒహోహో!!!'

'ఇంతకీ ఏవూరన్నారు?'

'అమలాపురం దగ్గిర....'

'ఒహోహో మరి చెప్పరేం?! మన ఇర్రిగేషన్ మినిస్టరు ఆ వూరివాడే! మొన్న నేమా ఇంటికి డిన్నర్‌కి వొచ్చాడు. ముందు తెలిసిందిగాదే! వివరాలు తెలుసుండేవి.'

'ఓహో, అయ్యా తమరు ...'

'ఇంతకీ పేరేవిటన్నారు ...'

'ఫణీంద్రుడుగారని....

'ఓహోహో ఫణీంద్రుడుగారి పుత్రడన్నమాట. మరి చెప్పరేం ఆ మాట! ఆయన తెలియకపోవటమేవిటండీ! అయ్యా మీరు 'బంగారపు గనిని పట్టేశారంటీ బాబూ. డబుల్ కంగ్రాచులేషన్స్.'

'థేంక్స్. థేంక్స్.'

'అయ్యా తమ టెండరెంత స్వామీ. హైయ్యెస్టు మీదే అయ్యుంటుంది లెండి. అందుకే ఛాన్సు కొట్టేశారు.'

'హి హి. ఏదో అంత లేదులెండి.'

'ఏం మొహమాటపడతారండీ స్వామీ. రత్నాలు వూరికే దొరుకుతాయటండీ అయ్యా నైవేద్యం లేనిదే భగవంతుడు మాత్రం వరమిస్తాడుటండీ మీ పిచ్చిగానీ. ఎన్ని లకారాలో చెప్పారు గాదు?"

'ఎంతో ఎక్కడ లెండి. ఒకటిన్నర.'

'భేష్ భేష్. అదృష్టవంతులండీ. పెళ్ళికి మీకు కావల్సిన పంచదార సప్లయి నాదే ననుకోండి. తెలిసిన వాడొకడున్నాడుఆలైనులో.అయ్యా మొహమాటపడకుండా నాకు ఫోనుచేసి చెప్పండి."

'అయ్యా తమరూ . .'

'ఇంతకీ కుర్రవాడికి ఏం పనన్నారు?'

'..... .'

'బాప్‌రే. అదృష్టవంతే మీదేనండీ. మీతో పరిచయం వున్నందుకు మేము గర్వపడాలి స్వామీ.'

'ఇంతకీ అబ్బాయి మాంఛి కీలక




స్థానంలో వున్నాడన్నమాట బంగారు బాతుని పట్టేశారు స్వామీ

'హి హి థేంక్స్

'అ, ఊ అంటూ నమ్చుకొడతారేవిటండీ రేపిపాటికి మీరు ఎమ్ ఎల్ ఎ అవబోతూ అయ్యా పెళ్ళికి అవసరమైతే మావి రెండు కార్లు నాలుగు టేక్సీలు పంపిస్తాను వాడుకోండి '

'హిహి ఏదో మీ అభిమానం, దయ '

'నా దయేమిటండీ బాబూ మధ్యలో ఇంతకీ అబ్బాయి వంశం గట్రా భేషయిన వన్న మాట!'

'అబ్బో! బ్రహ్మాండమయిన వంశమండీ అబ్బాయికి కావాల్సిన వాళ్ళంతా హై పొజిషన్స్‌లో వున్నారు మచ్చలేని వంశం, నాలుగు తరాలకి సరిపడ ఆస్థి బాకులాటి కుర్రాడు లెండి! ఏకైక వారసుడు లెండి '

మరింకేం బాబూ అందుకే తమరిది హైయ్యెస్టు కెండరు! అయ్యా! మా కుటుంబం తరఫున అభినందనలు స్వీకరించండి

'కృతజ్ఞుడ్ని ఇంతకీ తమరు

'ఏమిటండీ బాబూ ఇంకా 'తమరు' 'తమరు అంటూనే వున్నారు!! ఇంకా నేనెవరో గుర్తించలేదా స్వామీ!

'తమరు

'నేనండీ బాబూ పాచికల పాండురంగ రావుని ఇంతకీ మీరు వైకుంఠంగారవునా కాదా?'

'వైకుంఠం ఎవడండీ!! నేను పాపనాశనాన్ని?'

'ఒహోహో! సారీసర్! చ్చొచ్చె! రాంగ్‌నంబర్ సర్! నాకు వైకుంఠం గారు కావాలి ఎక్స్క్యూజ్ మీ సర్! సారీసర్!

* * *

మరుసటి నెల పాచికల పాండురంగ రావుగా రమ్మాయికి, ఫణీంద్రుడిగా రబ్బాయికి ఆకాశమంత పందిరికింద, భూదేవంత అరుగుమీద బ్రహ్మాండంగా పెళ్ళి జరిగిపోయింది హైయ్యెస్టు టెండరు పాచికలవారిదేనని చెప్పనవసరంలేదుకదా! * * *